పకడ్బందీగా సమగ్ర కుటుంబ సర్వే

పెద్దపల్లి, నవంబర్6: పకడ్బందీగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సర్వే సిబ్బందికి సూచించారు.సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా కలెక్టర్ క్యాంపు ఆఫీస్‌ను హౌస్ లిస్టింగ్ చేస్తూ సర్వే సిబ్బంది స్టిక్కర్ అంటించారు. ఈనెల 8 వరకు ప్రతి ఎన్యుమరేటర్ తన పరిధిలోని 150 ఇండ్లను చెక్ చేసుకుని స్టిక్కర్ అతికించి, ప్రతి రోజు 10 ఇండ్ల చొప్పున 15 రోజుల్లో సర్వే పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.

కాల్వశ్రీరాంపూర్, నవంబర్ 6: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రజలు పాల్గొని ఎన్యుమరేటర్లకు వివరాలు అందించి సహకరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు. పెగడపల్లిలో ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా ఎన్యుమరేటర్లు చేపట్టిన హౌస్ లిస్టింగ్ ప్రక్రియను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈనెల 8వరకు హౌజ్ లిస్టింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. మరిన్ని సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికల రూపకల్పనకు మాత్రమే ఈ సర్వే చేపడుతున్నామని స్పష్టం చేశారు. ఎటువంటి అపోహలు లేకుండా ప్రజలు పూర్తి వివరాలను అధికారులకు అందించి సహకరించాలని కోరారు. అనంతరం పెగడపల్లి, కాల్వశ్రీరాంపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలతో పాటు గంగారం, కాల్వశ్రీరాంపూర్‌లో ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. అనంతరం పెద్దరాత్‌పల్లిలో నిర్మించే ఆయిల్‌పాం ఫ్యాక్టరీ ప్రదేశాన్ని పరిశీలించారు. జిల్లా సహకార అధికారి శ్రీమాల, తహసీల్దార్ వకీల్, ఎంపీడీవో రామ్మోహనాచారి, ఎంపీవో గోవర్ధన్, అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఘటన బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

ముత్తారం, నవంబర్ 6: ఇటీవల ముత్తారం కేజీబీవీలో జరిగిన ఘటన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేజీబీవీలో 57 మంది అస్వస్థతకు గురి కాగా 54 మంది కోలుకున్నారని, మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లో చికిత్స అందించి డిశ్చార్జ్ చేశారని తెలిపారు. అదే ముగ్గురు విద్యార్థినులకు మరోసారి అస్వస్థతకు గురికాగా హైదరాబాద్‌కు తీసుకెళ్లారని తెలిపారు. ఇంత జరుగుతున్నా అధికారులు బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుపై భరోసా కల్పించాలని సూచించారు. కలెక్టర్ చొరవ తీసుకొని విచారణ చేపట్టి కేజీబీవీ ఘటన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సేవ చేయడం అభినందనీయం

కన్నవారి పేరున పేదవారికి సేవ చేయడం అభినందనీయమని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. అడవిశ్రీరాంపూర్‌లో చిగురు మధుసూదన్ వర్ధంతి సందర్భంగా గ్రామస్తుల సౌకర్యార్థం ఆయన కుమారుడు విద్యాసాగర్ నిర్మించిన మినీ వాటర్ ట్యాంక్‌ను పుట్ట మధూకర్ ప్రారంభించారు.

పరామర్శ

అడవిశ్రీరాంపూర్‌లో పలు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పరామర్శించారు. గ్రామానికి చెందిన గాదర్ల హరీశ్, రామగిరి స్వామి, బోగం మల్లేశ్వరి, పోలం మొగిళి, బిస్కుల సమత ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాలను పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఇక్కడ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతుపెద్ద కిషన్ రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, మాజీ ఎంపీపీలు జక్కుల ముత్తయ్య, అత్తె చంద్రమౌళి, మాజీ వైస్ ఎంపీపీ సుదాడి రవీందర్ రావు, నాయకులు నూనె కుమార్, అశోక్, పప్పు స్వరూప చంద్రమౌళి, రమణారెడ్డి, వీరేందర్, సమ్మయ్య, దివాకర్, బాలు, మధుకర్, రమేశ్, స్వామి పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గర్రెపల్లి పీఏసీఎస్‌లో స్వాహాపర్వం?

- సంఘ భవనం కోసం భూమి కొనుగోలులో అక్రమాలు
- ₹5లక్షలు కాజేత.. భూ యజమాని నుంచి మరో ₹2లక్షలు వసూలు!
- విచారణకు సంఘం సభ్యుల డిమాండ్

గర్రెపల్లిలోని పీఏసీఎస్ కార్యాలయం

పెద్దపల్లి, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): గర్రెపల్లిలోని సహకార సంఘం సొంత స్థలంలో 20 ఏండ్ల క్రితమే విశాలమైన గదులతో పక్కా భవనం నిర్మించారు. వాస్తవానికి ఇక్కడ మరో భవనం అవసరం లేదు. కానీ, సంఘం సేవలు విస్తరింపజేయాలనే నెపంతో ప్రస్తుత పాలకవర్గ సభ్యులు ఇక్కడే స్వాహాకార పర్వానికి తెరలేపారు. గ్రామంలోనే రాజీవ్ రహదారికి ఆనుకుని ఉన్న సర్వే నెంబర్ 67/అ లోని మూడున్నర గుంటల భూమిని కొనుగోలు చేశారు. ₹39లక్షలకు బేరం కుదుర్చుకున్న పాలకవర్గ సభ్యులు ₹44లక్షలకు కొనుగోలు చేసినట్లు పత్రాలు సృష్టించి, కో-ఆపరేటివ్ అధికారులను నమ్మించినట్టు తెలిసింది. విషయం బయటికి రాకుండా ఎవరడిగినా ₹44లక్షలకు విక్రయించినట్లు చెప్పాలని భూయజమానికీ హుకుం జారీ చేసినట్టు సమాచారం. అయితే అదనంగా రాసుకున్న ₹5లక్షలు అధికారుల ఖర్చుల కోసమేనని సెలవిచ్చారు. ఆరునెలలు కాలయాపన చేసి అనంతరం పలు దఫాలుగా భూ యజమానికి చెక్కుల రూపంలో ₹44లక్షలు ముట్టజెప్పి, సెప్టెంబర్‌లో సొసైటీ పేరిట భూమి రిజిస్ట్రేషన్ చేయించారు. ముందుగా మాట్లాడుకున్నట్టు భూ యజమాని నుంచి ₹5లక్షలు తీసుకోవడంతోపాటు అతనిని బెదిరించి మరో ₹2లక్షలు లాగేసుకున్నట్టు తెలిసింది. అయితే ఈ వ్యవహారంపై పలువురు సభ్యులు గుర్రుగా ఉన్నట్లు తెలుస్తున్నది. సంఘం పరపతి కాపాడాల్సిన పాలకవర్గ సభ్యులే పరువు తీయడాన్ని సొసైటీ సభ్యులు జీర్ణించుకోలేక పోతున్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

బెదిరించి డబ్బులు తీసుకున్నరు

గర్రెపల్లి పీఏసీఎస్‌కు మూడున్నర గుంటల భూమిని ₹39లక్షలకు అమ్మేందుకు ఒప్పందం చేసుకున్నాం. కానీ, భూమి ఎంతకు అమ్మినవని ఎవరడిగినా ₹44లక్షలు అని చెప్పాలని పాలకవర్గ సభ్యులు అన్నరు. పలు దఫాలుగా చెక్కుల రూపంలో ₹44లక్షలు ముట్టజెప్పి, అందులో నుంచి ₹5లక్షలు తిరిగి తీసుకున్నరు. అక్కడితో ఆగకుండా నన్ను బెదిరించి నాకు ఇచ్చిన ₹39లక్షల్లోంచి మరో ₹2లక్షలు బలవంతంగా వసూలు చేసి, ₹37లక్షలే ఇచ్చిన్రు. పాలకవర్గ సభ్యులు నాకు చాలా అన్యాయం చేశారు. ఇది మంచి పద్ధతి కాదు.

- సందెవేన శ్రీనివాస్, భూమి విక్రేత (గర్రెపల్లి)

ఎలాంటి అక్రమాలు జరగలేదు..

పీఏసీఎస్ కోసం కొనుగోలు చేసిన 3.5 గుంటల భూమి విక్రయంలో ఎలాంటి అక్రమాలు జరగలేదు. పూర్తిగా పాలకవర్గం ముందు పారదర్శకంగా తీర్మానం చేసి ₹44లక్షలకు కొనుగోలు చేశాం. అందుకు సంబంధించిన పూర్తి ఆధారాలు ఉన్నాయి. అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు వస్తే వాటిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి.

- జూపల్లి సందీప్‌రావు, పీఏసీఎస్ చైర్మన్

వృద్ధులే లక్ష్యంగా సైబర్ కేటుగాళ్లు

- రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్

జ్యోతినగర్, నవంబర్ 6: వృద్ధులే లక్ష్యంగా సైబర్ కేటుగాళ్లు నేరాలకు పాల్పడుతున్నారని రామగుండం పోలీసు కమిషనర్ ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎన్టీపీసీ ఈడీసీ మిలినీయం హల్‌లో సైబర్ క్రైమ్‌పై సీనియర్ సిటిజన్స్‌కి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సీపీ మాట్లాడారు. ఇటీవల సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతున్న వారు విశ్రాంతి ఉద్యోగులే ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. క్షణం తీరికలేకుండా గడిపిన ఉద్యోగులు, వ్యాపారులు రిటైర్మెంట తర్వాతర కాలక్షేపం కోసం సోషల్ మీడియాను ఆశ్రయించడంతో సైబర్ నేరగాళ్లు వారి బలహీనతనే అవకాశంగా చేసుకొని సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. సైబర్ జాగృకత దివాస్ కార్యక్రమంలో భాగంగా ఈ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుత నేరాల తీరుపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. తెలియని నెంబర్ల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు సమాచారం ఇవ్వొద్దన్నారు. ముఖ్యంగా వాట్సాప్ వీడియో కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మోసపోయిన వారు వెంటనే 1930 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఇక్కడ గోదావరిఖని ఏసీపీ ఎం రమేశ్, రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, సీనియర్ సిటిజన్ పీటీ స్వామి, విశ్రాంతి ఉద్యోగులు ఉన్నారు.

ఠాణాలను సందర్శించిన సీపీ

కమాన్‌పూర్/ధర్మారం, నవంబర్ 6: కమాన్‌పూర్, ధర్మారం ఠాణాలను సీపీ శ్రీనివాస్ సందర్శించారు. ఆయా ఠాణాల్లోని రికార్డులు, క్రైం రేట్ తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ల ఆవరణలను పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. బ్లూకోల్ట్స్ సిబ్బందితో మాట్లాడి డయల్ 100 కాల్స్‌కు స్పందించి వారు సంఘటన స్థలానికి చేరుకున్న సమయం, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని సూచించారు. ఆయన వెంట రామగుండం అడ్మినిస్ట్రేటివ్ డీసీపీ సీ రాజు, పెద్దపల్లి, గోదావరిఖని ఏసీపీలు గజ్జి కృష్ణ, రమేశ్, సీఐలు ప్రవీణ్‌కుమార్, ప్రసాద రావు, ఎస్సైలు ప్రసాద్, లక్ష్మణ్ ఉన్నారు.

13మంది సీఐల బదిలీలు

ఫర్టిలైజర్‌సిటీ, నవంబర్ 6: మల్టీజోన్ 1 పరిధిలో పని చేస్తున్న 13మంది సీఐలను బదిలీ చేస్తూ బుధవారం ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్ సీఐ కే పురుషోత్తంను రామగుండం ట్రాఫిక్-1లో వెయింటింగ్‌కు, ఐజీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న వై చంద్రవేఖర్‌గౌడ్‌ను ఐటీ సెల్ రామగుండంకు, సీహెచ్ అజయ్‌కుమార్‌ను ములుగు ఎక్సిటింగ్ వెకెన్సీగా, ఆదిలాబాద్ బోథ్ సర్కిల్ సీఐ బానోత్ రమేశ్‌ను సీసీఎస్ ములుగుకు బదిలీ చేస్తూ ఐజీ ఆదేశాలు జారీ చేశారు.

ఫాగింగ్ మిషన్‌లో మంటలు: తప్పిన ప్రమాదం

పెద్దపల్లి టౌన్, నవంబర్ 6: పట్టణంలోని శాంతినగర్ పెట్రోల్ పంపు సమీపంలో బుధవారం రాత్రి దోమల నివారణ కోసం మున్సిపల్ సిబ్బంది ఫాగింగ్ చేస్తున్నండగా మిషన్‌లో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే మంటలను అదుపుచేశారు ఫాగింగ్ సిబ్బంది శివ మాట్లాడుతూ శాంతినగర్‌లో ఫాగింగ్ పూర్తి చేసి, మిషన్ ఆఫ్ చేశామని, అదే క్రమంలో సాంకేతిక లోపం కారణంతో మంటలు చెలరేగినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పెద్దపల్లి, నవంబర్6: తెలంగాణ ఫొటో, వీడియోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కె హుస్సేన్ తెలిపారు. పెద్దపల్లిలోని ఓ ఫంక్షన్ హాలులో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోగుల విజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యవర్గ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్ మాట్లాడారు. జూలపల్లి మండలం వడుకాపూర్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ కన్నం వెంకటకృష్ణ మృతి చెందడంతో కుటుంబ భరోసా పథకం ద్వారా బాధిత కుటుంబానికి రూ. 1,60 లక్షల విలువైన చెక్కు, ప్రమాదవశాత్తు గాయపడిన మరో ఫొటోగ్రాఫర్ వైద్య రాజేందర్‌కు రూ.10,000 చెక్కు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరి రవి, నాయకులు మహిమాల కేదార్ రెడ్డి, పల్లెర్ల ఉదయ్, మొహమ్మద్ ఇర్ఫాన్, అల్లం సతీశ్ కుమార్, కుడిక్యాల శ్రీధర్, జిల్లా గౌరవ సలహాదారులు లగిశెట్టి చంద్రమౌళి, కుర్మ రమేశ్ బాబు, తూర్పాటి సత్యనారాయణ, మొదుంపల్లి రామస్వామి, వీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'మా కుమారుడి కోరిక మేరకే అవయవదానం'

కోల్‌సిటీ, నవంబర్ 6: తమ కుమారుడు సాయి నితీష్ కోరిక మేరకే మరణానంతరం అవయవాలు దానం చేశామని నితీష్ తల్లిదండ్రులు, మేనమామలు ముత్యాల శ్రీధర్, సాగర్ స్పష్టం చేశారు. గోదావరిఖని తిలక్‌నగర్‌కు చెందిన సాయి నితీష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా చికిత్స పొందుతూ చనిపోయాడు. తన మరణానంతరం అవయవాలు మరొకరికి ఉపయోగపడాలని సాయి నితీష్ కోరిక మేరకే తాము జీవన్‌దాన్ సభ్యులను సంప్రదించి శరీర అవయవాలు దానం చేశామని పేర్కొన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ సభ్యులు రామస్వామి గాని, మరేతర సభ్యులకు సంబంధం లేదని పేర్కొన్నారు. కేవలం వారి పబ్లిసిటి కోసమే ప్రచారం చేసుకున్నారని పేర్కొన్నారు.

కారు-ఆటో ఢీ : పలువురికి గాయాలు

పెద్దపల్లి రూరల్, నవంబర్ 6: రాఘవాపూర్-రంగాపూర్ గ్రామాల మధ్య కారు, ఆటో ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆటోలో ప్రయాణిస్తున్న పలువురు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కమాన్‌పూర్ మండలం రొంపికుంటకు చెందిన అన్సర్ అలియాస్ బబ్లూ ఆటోలో ప్రయాణికులను తీసుకుని రొంపికుంట నుంచి పెద్దపల్లికి వెళ్తున్నారు. రంగాపూర్-రాఘవాపూర్ గ్రామాల మధ్య ఇటుక బట్టీల సమీపంలో మంథనివైపు వెళ్తున్న కారు ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి సంఘటన స్థలానికి వెళ్లారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గొల్లపల్లి వద్ద కారు బైక్ ఢీ...

గొల్లపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రంగారెడ్డి గాయపడ్డారు. అప్పన్నపేటకు చెందిన పిడుగు రవి బైక్‌పై గోదావరిఖని వైపు వెళ్తుండగా అదే మార్గంలో వస్తున్న జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో రంగారెడితో పాటు పిడుగు రవికి స్వల్పగాయాలయ్యాయి. చికిత్స కోసం వీరిద్దరని దవాఖానకు తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ స్వామి తెలిపారు.

'పుడా'కు న్యాయవాదుల మద్దతు

పెద్దపల్లి కమాన్, నవంబర్ 6 : పెద్దపల్లి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పుడా) ఏర్పాటుకు పెద్దపల్లి బార్ అసోసియేషన్ తరపున మద్దతు ప్రకటించినట్లు అధ్యక్షుడు లకిడి భాస్కర్, న్యాయవాదులు తెలిపారు. పుడా సాధన సమితి నాయకులు భూషణవేని రమేశ్ గౌడ్, బొంకూరి సురేందర్ సన్ని, కావేటి రాజగోపాల్, తూముల శ్రీనివాస్, బొడ్డుపల్లి రామ్మూర్తి బుధవారం బార్ అసోసియేషన్ సభ్యులను కలిసి పుడా ఏర్పాటుకు సహకరించాలని కోరగా, న్యాయవాదులు సానుకూలంగా స్పందించారు. ఇక్కడ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వాసు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రూప్లానాయక్, బలరాంరెడ్డి

ధర్మారం,నవంబర్6: స్థానిక ఏఎంసీ చైర్మన్ లావుడ్య రూప్లా నాయక్, నంది మేడారం ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి కోరారు. మండలంలోని పెర్కపల్లి, బంజేరుపల్లి, చామనపల్లి, బొమ్మారెడ్డిపల్లి, కొత్తపల్లిలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను వారు సంయుక్తంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ అరిగె లింగయ్య, డైరెక్టర్ కాంపల్లి రాజేశం, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామంతుల రాజమల్లు, డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహం,బీఆర్ఎస్ నాయకులు దేవి రమణ, మిట్ట తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్టీపీసీ రైజింగ్ డే

జ్యోతినగర్, నవంబర్ 6: 49 వసంతాలు పూర్తి చేసుకున్న ఎన్టీపీసీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రామగుండం ఎన్టీపీసీలో యాజమాన్యం ప్రాజెక్టు స్థాయిలో ఎన్టీపీసీ రైజింగ్‌డే వేడుకలు చేపట్టింది. ఎన్టీపీసీ పరిపాలన భవనంలో ఎన్టీపీసీ జెండా ఆవిష్కరణ, ఎన్టీపీసీ అవిర్భావ దినోత్సవ కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ, విజిలెన్స్ అవగాహన పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ, అనంతరం న్యూఢిల్లీ నోయిడాలో జగిరే ఎన్టీపీసీ రైజింగ్‌డే వేడుకల్లో ఎన్టీపీసీ సీఎండీ ఎన్టీపీసీ జెండా ఆవిష్కరణ, ప్రసంగం వేడుకలను తిలకించేందుకు ఏడీఎం బిల్డింగ్‌లోని హెచ్‌ఓపీ కాన్ఫరెన్స్ హాల్‌లో వెబ్‌కాస్ట్ ద్వారా ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసారం తిలకించేందుకు యాజమాన్యం ఏర్పాట్లు చేసింది.

కేబినెట్ ఆమోదంపై హర్షం

జ్యోతినగర్, నవంబర్ 6: ఎన్టీపీసీలో తెలంగాణ ఫేస్ 2 కింద చేపట్టనున్న 2,400మెగావాట్ల మూడు యూనిట్ల ప్రాజెక్టు నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వ కేబినెట్ సమావేశం మంగళవారం ఆమోదంపై ఎన్టీపీసీ కాంగ్రెస్ పట్టణ కమిటీ హర్షం వ్యక్తం చేసింది. బుధవారం ఎన్టీపీసీలో ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టణ కమిటీ అధ్యక్షుడు ఆసిఫ్‌పాషా మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతులు ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ర్యాకల్‌దేవ్‌పల్లిలో పొలం బాట

ఎలిగేడు, నవంబర్ 6: పెద్దపల్లి ఎస్‌ఈ బొంకూరు సుదర్శన్ డీఈ తిరుపతితో కలిసి ర్యాకల్‌దేవ్‌పల్లిలో బుధవారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ సరఫరా, ఇతర సమస్యలు ఏమైనా ఉంటే వుంటే విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకు వస్తే వాటిని సిబ్బంది పరిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సుల్తానాబాద్ ఏడీ వెంకటేశ్వర్లు, ఎలిగేడు ఏఈ సంపత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

'పది'లో 10 జీపీఏ లక్ష్యం

పెద్దపల్లి, నవంబర్6: పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 10 జీపీఏ వచ్చేలా కార్యాచరణ రూపొంది అమలు చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష జిల్లా విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. ఎల్ఐపీ అమలు, పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ, ఫలితాలు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు సమావేశం లో డీఈవో మాధవి, జిల్లా సమగ్ర శిక్ష సమన్వయకర్త పీఎం షేక్, ఎంఈవోలు, హెచ్ఎంలు, పాల్గొన్నారు.

మద్దతు ధరకు పత్తి కొనుగోలు

సుల్తానాబాద్/ సుల్తానాబాద్ రూరల్, నవంబర్ 6: సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా నాణ్యమైన పత్తిని క్వింటాలుకు రూ.7521 మద్దతు ధర చెల్లిస్తున్నట్లు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు తెలిపారు. చిన్నికల్వల పరిధిలోని వెంకటేశ్వర జిన్నింగ్‌లో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే విజయరమణా రావు బుధవారం ప్రారంభించారు. అంతకు ముందు ఎమ్మెల్యేను జిన్నింగ్ మిల్లు యాజమాని శ్రీనివాస్‌రెడ్డి సత్కరించారు. సుల్తానాబాద్‌లోని సెయింట్ మేరీస్ స్కూల్‌లో ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలబాలికల ఖోఖో పోటీలను ఎమ్మెల్యే విజయరమణారావు ప్రారంభించారు. అనంతరం అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు గెల్లు మధుకర్‌యాదవ్‌ను సన్మానించారు. పోటీల్లో బాలుర విభాగంలో పెద్దపల్లి ప్రథమ స్థానంలో నిలువగా, జగిత్యాల జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో సిరిసిల్ల ప్రథమ, జగిత్యాల, కరీంనగర్ జట్లు ద్వితీయస్థానంలో నిలిచాయి. ముగింపు సమావేశంలో విజేతకలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, ఏఎంసీల చైర్మన్లు మినుపాల ప్రకాష్‌రావు, ఈర్ల స్వరూప, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, ఏఎంసీ కార్యదర్శి మనోహర్, సీసీఐ అధికారి రత్నకర్, మిలు యాజమాని శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గణేశ్,డీఈవో మాధవి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, సాయిరి మహేందర్, బిరుదు కృష్ణ, చిలుక సతీష్, వేగోళం అబ్బయ్యగౌడ్, దాసరి రమేశ్, వేల్పుల సురేందర్,దాసరి ప్రసాద్, ప్రిన్సిపాల్ శౌరెడ్డి, పన్నాల తిరుపతి, అమిరిశెట్టి తిరుపతి న్నారు.

పెద్దపల్లి రూరల్, నవంబర్ 6: నిమ్మనిపల్లి, నిట్టూరులో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని, పెద్దపల్లి సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే విజయరమణారావు సంబంధిత అధికారులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప సురేందర్, వైస్ చైర్మన్ కూర మల్లారెడ్డి, పెద్దపల్లి సింగిల్ విండో చైర్మన్ మాదిరెడ్డి నర్సింహా రెడ్డి, వైస్ చైర్మన్ మాదారపు ఆంజనేయ రావు, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, మార్కెట్ కార్యదర్శి దేవిరాజ్ పృథ్వీరాజ్, సీసీఐ అధికారి రత్నాకర్, సీఈవో మెట్టు మదన్ మోహన్, ఎనగందుల ప్రదీప్, ఎనగందుల నారాయణ, సింగిల్ విండో డైరెక్టర్‌లు, మార్కెట్ డైరెక్టర్లు నాయకులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపు ప్రారంభం

ఓదెల, నవంబర్ 6: కొలనూర్‌లో ఏర్పాటు చేసిన ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్స్, సీడ్స్ షాపును ఎమ్మెల్యే విజయరమణారావు ప్రారంభించారు. ఇక్కడ పీఏసీఎస్ మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, నాయకులు ఎడవెల్లి జయపాల్‌రెడ్డి, చింతిరెడ్డి విజయేందర్‌రెడ్డి, బైరి రవి గౌడ్, గుండేటి ఐలయ్య, దొడ్డె శంకర్, అమ్ముల భిక్షపతి, పాకాల సంపత్‌రెడ్డి, పిట్టల కొమురయ్య పాల్గొన్నారు.

గొల్లపల్లిలో సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం

కమాన్‌పూర్, నవంబర్ 6: గొల్లపల్లిలోని పరమేశ్వర కాటన్ అగ్రో ఇండస్ట్రీస్‌లో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ కార్యదర్శి సురేందర్, సీసీఐ అధికారి గజేంద్ర తైవాడే, జిన్నింగ్ మిల్లు యామాన్యం రాజ్‌కుమార్, కృష్ణ, రైతు సంఘం నాయకులు శశిభూషణ్ కాచే, రైతులు పాల్గొన్నారు.

ఆర్జీ-3 ఏరియాలో డీపీవో పర్యటన

రామగిరి, నవంబర్ 6: ఆర్జీ-3 ఏరియా సెంటినరీకాలనీలో కార్మిక కుటుంబాల నీటి సమస్యలపై ప్రజాప్రతినిధులు డీపీవో వీర బుచ్చయ్య దృష్టికి తీసుకెళ్లగా, బుధవారం ఆయన సింగరేణి అధికారులను పిలిపించి మాట్లాడారు. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సింగరేణి డీజీఎం రాజేంద్ర కుమార్, డీవైఎస్ఈ రామకృష్ణ పాల్గొన్నారు.

30మంది బీఆర్ఎస్ నేతలపై కేసు

ఫర్టిలైజర్‌సిటీ, నవంబర్ 6: రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలోకి బుధవారం బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన నాయకులు, ప్రజాప్రతినిధులు బుధవారం దౌర్జన్యంగా ప్రవేశించి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని, అధికారుల విధులకు ఆటంకం కలిగించడంతో గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో 30మందిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ కే రమేశ్ తెలిపారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు మేరకు తిరుపతి, రాజేశ్, వేణుతో పాటు మొత్తం 30మందిపై కేసునమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సదర్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

పెద్దపల్లి టౌన్, నవంబర్ 6: పెద్దపల్లిలో మొదటిసారి నిర్వహించనున్న సదర్ ఉత్సవాలను విజయవంతం చేయాలని, యాదవులంతా సహకరించాలని అఖిల భారత యాదవ మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ సందనవేన రాజేందర్‌యాదవ్ కోరారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో సదర్ ఉత్సవాల కర పత్రాలను బుధవారం విడుదల చేశారు. పెద్దపల్లిలోని జెండా చౌరస్తాలో ఈ నెల 10న సాయంత్రం నాలుగు గంటలకు పెద్ద ఎత్తున సదర్ ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ నాయకులు లచ్చన్న, సంతోష్, సాయికృష్ణ, తిరుపతి, సతీశ్ యాదవ్ పాల్గొన్నారు.

నిధులు ఎవరిస్తారు..?

మంథని, నవంబర్ 5: సదర్ పండుగను అధికారికంగా నిర్వహిస్తున్నామని ప్రకటిస్తే సరిపోతుందా, పండుగ ఖర్చుల కోసం నిధులు ఎవరు విడుదల చేస్తారరని అఖిల భారత యాదవ మహాసభ యూత్ మంథని డివిజన్ నాయకుడు కనవేన శ్రీనివాస్ యాదవ్, యాదవ సంఘం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పెగడ శ్రీనివాస్ యాదవ్ ప్రశ్నించారు. మంథని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి యాదవుల సమస్యలు పరిష్కరించాలని, గొర్రెల పంపిణీ చేయడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు వేముల లక్ష్మయ్య, కనవేన కొమురయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్వీ మండల కమిటీ నియామకం

కమాన్‌పూర్, నవంబర్ 6: బీఆర్ఎస్వీ మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి ఇజ్జగిరి సాకేత్ ప్రకటించారు. మండల కేంద్రంలోని ఆదివరాహస్వామి కల్యాణ మండపంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కొయ్యడ కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా మబ్బు హరికృష్ణ, ఉపాధ్యక్షులుగా అనవేన అశోక్, చిప్పకుర్తి రాజ్‌కుమార్, కార్యదర్శిగా పడాల సాయి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌పై మండల అధ్యక్షుడు బొమ్మగాని అనిల్ గౌడ్, నాయకులు గుర్రం లక్ష్మీమల్లు, నీలం శ్రీనివాస్, ఆకుల గట్టయ్య, కొయ్యడ రవి, పోలుదాసరి సాయికుమార్, బొల్లపెల్లి శంకర్‌గౌడ్, కాంపెల్లి రవి, సాగర్ల పవన్, గోవిందుల ప్రవీణ్, నామని లింగయ్య, పెండ్లి నారాయణ, చిందం తిరుపతి పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల విడుదల

పెద్దపల్లి, నవంబర్6: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబురాలు-2024 వాల్ పోస్టర్‌ను కలెక్టర్ శ్రీహర్ష బుధవారం విడుదల చేశారు. జిల్లాలోని 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించనున్నట్లు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి ఏ నాగేశ్వర్‌రావు తెలిపారు. ఇక్కడ డీఈవో డీ మాధవి, ఎంఈవోలు, హెచ్ఎంలు, చెకుముకి జిల్లా కన్వీనర్ కాంపెల్లి లక్ష్మణ్, మండల కన్వీనర్ గద్దె శ్రీనివాస్ ఉన్నారు.

సెంటినరీకాలనీలోని ఐడీఎల్ మూసివేత ?

రామగిరి, నవంబర్ 6 : ఇరవై ఏళ్ల క్రితం ఆర్జీ -3 బొగ్గు గనుల కోసం సెంటినరీకాలనీలో నెలకొల్పిన ఐడీఎల్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీ మూసివేస్తున్నట్లు కంపెనీ యాజమాన్యం కార్యాలయ నోటీస్ బోర్డ్‌లో ప్రకటించినటు కార్మికులు తెలిపారు. ఇటీవల కోలిండియాలో పేలుడు పదార్థాల ముడి సరుకు టెండరులో సదరు కంపెనీ యాజమాన్యం తప్పుడు పత్రాలతో పాల్గొనడంతో , వారి టెండరును రద్దు చేసి ఆ కంపెనీని బ్లాక్ లిస్ట్‌లో చేర్చినట్లు తెలిసింది. సింగరేణిలో కూడా పేలుడు ముడి పదార్థాలకు నిర్వహించిన టెండరులో ఆ కంపెనీపై అనర్హత వేటు వేశారు. దీంతో కంపెనీ మూసివేతకు కూడా అనివార్యంగా మారింది. దీంతో ఐడీఎల్ కంపెనీలో పని చేస్తున్న 50 మంది కార్మికుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. కార్మిక చట్టాల ప్రకారం కంపెనీ మూసివేస్తే తమకు 90 రోజులు వేతనం, ఇతర బెనిఫిట్స్ కల్పించాల్సి ఉంటుందని కార్మికులు తమ డిమాండ్‌ను కంపెనీ అధికారుల ఎదుట ఏకరువు పెట్టారు. ఇతర కాంట్రాక్ట్ కంపెనీలో అవకాశం కల్పించాలని కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్రీడా సమీక్షలో రామగుండం ఎమ్మెల్యే

గోదావరిఖని, నవంబర్ 6: తెలంగాణలో నూతన క్రీడా విధానం రూపకల్పన, స్పోర్ట్స్ హబ్, సీఎం కప్, ఇతర అంశాలపై బుధవారం హైదరాబాద్‌లో జరిగిన క్రీడా సమీక్ష సమావేశంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ హాజరయ్యారు. క్రీడాకారుల నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు అంతర్జాతీయ క్రీడా రంగంలో తెలంగాణకు గుర్తింపు తెచ్చేలా సమగ్ర క్రీడా విధానాన్ని రూపొందించాలని ఎమ్మెల్యే సమావేశంలో పలు సూచనలను పేర్కొన్నట్లు పేర్కొన్నారు.

ఓసీపీ-1 పీవోగా రాజశేఖర్

యైటింక్లయిన్‌కాలనీ, నవంబర్ 6 : ఆర్జీ-3 ఏరియా ఓసీపీ-1 ప్రాజెక్టు అధికారిగా జంగిటి రాజశేఖర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా శ్రీభద్రకాళి అమ్మవారి ఆలయంలో ఆయన పలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏజెంట్ కార్యాలయానికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఉద్యోగులు, యూనియన్ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఓసీపీ-1 ప్రాజెక్టు పనులను మ్యాప్ ద్వారా పరిశీలించి ఉత్పత్తి, ఉత్పాదకత, బ్లాస్టింగు స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పీఈ ఉదయ్‌భాస్కర్, పర్యావరణ అధికారి కిషన్, సర్వే అధికారి యానాదిశెట్టి, వివిధ యూనియన్ల నాయకులు, అధికారులు ఉన్నారు.

జీఎం కార్యాలయంలో విజిలెన్స్ అవగాహన

గోదావరిఖని, నవంబర్ 6: విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా బుధవారం సింగరేణి ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో ఆర్జీ-1,2,3ఎఎల్‌పీ, భూపాలపల్లికి చెందిన ఉన్నతాధికారులకు అవగాహన కల్పించారు. కిషోర్ బగాద్దేయో అవగాహన కల్పించారు. ఇక్కడ అధికారులు కిరణ్‌బాబు, ఆంజనేయులు, మోహన్‌రావు, క్రాంతి, దాసరి శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, డానియల్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, సారంగపాణి, హన్మంతరావు, శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

ప్రమాదాల నివారణకు రక్షణ చర్యలు

పెద్దపల్లి రూరల్/పాలకుర్తి, నవంబర్ 6: పెద్దపల్లి మండలంతో పాటు పాలకుర్తి మండలం బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిదిలో రాజీవ్‌రహదారిపై ప్రమాదకర ప్రదేశాలను గుర్తించినట్లు పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పెద్దపల్లి మండలం బంధంపల్లి, అప్పన్నపేట, అందుగులపల్లి, ధర్మారం ఎక్స్‌రోడ్, బసంత్‌నగర్ బస్టాండ్, జీడీనగర్ బస్టాండ్ గొల్లపల్లి, మంథనిక్రాస్ రోడ్డు ప్రాంతాల్లో తరచూ జరిగే ప్రమాద స్థలాలను గుర్తించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకో వాలని బసంత్ నగర్ టోల్‌ప్లాజా నిర్వాహణ సంస్థ హెచ్‌కేఆర్ అధికారులను ఆదేశించారు. బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి, ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED HELPERS
jobs Apply Now!
★హైదరాబాద్ నందు 5 స్టార్ హోటల్‌లో పని చేయుటకు ''హెల్పర్లు'' కావలెను. 12 గంటల డ్యూటీ, 18,000/- జీతం, రూమ్+ఫుడ్ ఫ్రీ. వయస్సు: 18-30 సం||లు. No Consultency, Direct Job. Contact: 9885283513.
NT-335863_All
CHANGE OF NAME
★I, AFREEN KHANAM (Old Name) W/o. ABDUL HAMEED KHAN, R/o. H.No: 2-1-260, STREET: DUBBA WADA, Mandal: METPALLY-505325, District Jagtial, Telangana, Have changed my name as AFREEN NAAZ.
NTK-325733
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189